క్లుప్తంగా

రైస్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

మండవల్లి: రైస్ కార్డు అవసరమైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బి.ఆనంద బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో రైస్ కార్డు కోల్పోయిన వారు, రైస్ కార్డులో పేరు లేనివారిని కార్డులో చేర్పులు, మార్పులు, ఒంటరి వ్యక్తులకు కొత్తగా రైస్ కార్డులకు దరఖాస్తు చేసుకునే అవకాశం గ్రామ సచివాలయాల్లో కల్పించినట్లు పేర్కొన్నారు.

బలుసులమ్మ అమ్మవారి ఊరేగింపు

ముదినేపల్లి రూరల్: మండలంలోని శ్రీహరిపురం శివారు అయినంపూడిలో బలుసులమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏరువాక పౌర్ణమి సందర్భంగా మూడురోజుల కిందట ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, కోయనృత్యాల నడుమ భక్తజన సందోహంతో ఊరేగింపు సందడిగా జరిగింది. నిర్వాహకుడు పెద్దింటి కృష్ణమూర్తి పర్యవేక్షణలో ఈ ఊరేగింపు జరగగా, ప్రతి ఇంటా అమ్మవారికి భక్తులు హారతులిస్తూ ఘనంగా స్వాగతం పలికారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో మేలు



కైకలూరు (కలిదిండి): రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్‌పీ గౌతమ్‌కుమార్ చెప్పారు. కలిదిండి మంబలం కోరుకొల్లు గ్రామంలో రైతులకు చేపబెల్లం ద్రావణం(గోత్ ప్రమోటర్) తయారీ విధానాన్ని వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల నేల సారవంతంగా మారుతుందన్నారు. ప్రభుత్వం ప్రకృతి సాగును ప్రోత్సహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ నజీర్‌ఖాన్, రైతులు పాల్గొన్నారు.

శ్రీవారికి లక్ష మల్లెలతో అర్చన

వేకనూరు(అవనిగడ్డ): వేకనూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిపించారు. సర్పంచ్ తుంగల లక్ష్మీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తికేయుని ఆలయం కిటకిట

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది.

మండల టాపర్లకు బహుమతుల ప్రదానం

చల్లపల్లి: తల్లిదండ్రులు తమ బిడ్డలకు విద్యతో పాటు సమాజ నడవడిక నేర్పాలని, సమాజంతో కలిసి నడిచిన వారు ఖచ్చితంగా గొప్పవాళ్లు అవుతారని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య సత్రంలో ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల 1988–2020 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పదో తరగతి టాపర్లుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులు 23 మందిని సన్మానించి రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేశారు. విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు, విజయవాడ పీబీ సిద్దార్థ కళాశాల ప్రిన్సిపాల్, ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి మేకా రమేష్ మాట్లాడారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండల స్థాయి టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థినులకు కన్యకా పరమేశ్వరి కల్యాణ మంటపం అధ్యక్షుడు కొల్లిపర మధు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందచేశారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏటీఎంలో నగదు చోరీపై కేసు

కోనేరుసెంటర్: ఏటీఎంలో నగదు చోరీపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం మాచవరానికి చెందిన సుంకర క్రీస్తురాజు గత నెల 10వ తేదీన బస్టాండ్ సెంటర్ బెల్ కంపెనీకి సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. డబ్బులు డ్రా చేయడం తెలియని క్రీస్తురాజు పక్కనే ఉన్న వ్యక్తికి తన కార్డు ఇచ్చి డబ్బులు డ్రా చేయించాడు. అనంతరం కార్డు తీసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. ఇంటికి వెళ్లిన పది నిమిషాల్లో తన ఖాతాలోని రూ. 11,500 నగదు మరలా డ్రా చేసినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఏటీఎం కార్డును పరిశీలించగా అది నకిలీది అని గుర్తించాడు. ఏటీఎంలో డబ్బులు డ్రా చేసిన వ్యక్తి నకిలీ కార్డును తనకు ఇచ్చి తన కార్డును అతను దొంగిలించి డబ్బులు డ్రా చేసినట్లు గ్రహించిన క్రీస్తురాజు వెంటనే తన కార్డును బ్లాక్ చేశాడు. దీనిపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ప్రాణాలు తీస్తున్న ప్లాస్టిక్

- పశువుల ప్రాణాలకు ముప్పు
- చెత్తతో కలిసిన కవర్లు తింటున్న పశువులు
- అమలుకు నోచుకోని ప్లాస్టిక్ నిషేధం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



క్యారీబ్యాగులు తిన్న పశువుకు శస్త్ర చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

కైకలూరు: మూగజీవాల ప్రాణాలకు ప్లాస్టిక్ ముప్పు తెస్తోంది. నిషేధం అమలుకు నోచుకోపోవడంతో గ్రామాల్లో వినియోగం మరింత పెరిగింది. ఇటీవల కాలంలో ఆహార పదార్థాల వ్యర్థాలను క్యారీ బ్యాగుల్లో ఉంచి బహిరంగ ప్రదేశాల్లో పడవేయడం వల్ల పశువులు వాటిని తిని జీర్ణకోశ సంబంధ వ్యాధులతో మృత్యువాత పడుతున్నాయి.

కఠిన చర్యలు అవసరం..

ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ కోసం ఐక్యరాజ్య సమితి రెండో సమావేశం ఈనెల 29 నుంచి జూన్ 2 వరకు ఫ్రాన్స్‌లో జరుగుతోంది. ప్రమాదకర ప్లాస్టిక్ వినియోగంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పలువురు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన కైకలూరు రహదారులపై పశువుల సంచారం అధికం. గుంపులు, గుంపులుగా సంచరిస్తూ రోడ్డు సమీపంలోని దొరికిన అహారాన్ని తీసుకుంటున్నాయి. క్యారీబ్యాగులను ఆహారంతో పాటు తినేస్తోన్నాయి. చివరకు కడుపులో ఇవి పేరుకుపోయి మరణాలకు కారణమవుతోంది. ఇటీవల కాలంలో అనేక పశువులకు శస్త్ర చికిత్సలు చేసి కేజీల ప్లాస్టిక్‌ను పశు వైద్యులు బయటకు తీశారు. వీటిలో కొన్ని పశువులు మరణించిన ఘటనలు ఉన్నాయి.

అమలుకు నోచుకోని నిషేధం

నిబంధనలు కఠినతరం చేసినా నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. 20 మైక్రాన్ల కంటే తక్కువ ప్లాస్టిక్ సంచులపై నిషేధముంది. తయారీదారులు ప్రతీ క్యారీ బ్యాగ్‌పై చిరునామాతో పాటు రీసైకిల్ చేసిన ప్లాస్టిక్, అసలు ప్లాస్టిక్ వివరాలు ముద్రించాలి. సహజ చాయ, తెలుపు రంగుల కవర్లను మాత్రమే వాడాలి. ఇవి జరగడం లేదు. అతిక్రమించిన వారికి రూ.25 వేల నుంచి రూ.50 వేలు, చిల్లర వ్యాపారులకు రూ.2,500 నుంచి రూ.5 వేలు, బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ సంచులు పారవేస్తే రూ.250 నుంచి రూ.500 వరకూ జరిమానా విధించే అవకాశం ఉంది. వీటిని అమలు చేయడానికి జిల్లా, గ్రామ స్థాయిలో కమిటీలు ఉన్నాయి.

యజమానుల పాత్ర కీలకం

పశువులను రోడ్లుపై కొందరు యజమానులు విడిచి పెడుతున్నారు. ఆహారపు కొరత కారణంగా పశువులు ఆహారంతో పాటు పడేసిన క్యారీబ్యాగులు తింటున్నాయి. వాస్తవానికి క్యారీబ్యాగు భూమిలో విచ్ఛిన్నం అవడానికి 10 నుంచి 20 సంవత్సరాలు కాలం పడుతోంది. క్యారీబ్యాగ్‌ల్లో ఉండే పిగ్మెంట్లు, ప్లాస్టిసైజర్లు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోకి ప్రవేశిస్తే నాడీవ్యవస్థ దెబ్బతింటుంది.

సంరక్షించుకోవాలి..



రహదారుల వెంట పారేస్తున్న క్యారీబ్యాగులను పశువులు తింటున్నాయి. అవి కడుపులో పేరుకుపోవడం వల్ల జీర్ణకోశ సంబంధ వ్యాధులు వస్తున్నాయి. ఎక్కువ కేసుల్లో శస్త్ర చికిత్సలు చేసి ప్లాస్టిక్‌ను తొలగిస్తున్నాం. శస్త్ర చికిత్స చేసిన తర్వాత యజమానులు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి.

– ఎస్‌కే ముస్తాఫా ఖాన్, పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు, కైకలూరు

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు



శ్లోకాలు నేర్పిస్తున్న సూర్యనారాయణ



మండవల్లి గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న భాస్కరరావు, పర్వీన, విద్యార్థులు



గుడ్లవల్లేరులో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



ముదినేపల్లి గ్రంథాలయంలో నీతికథలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం మహాభారత శ్లోకాలు నేర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు కె.సూర్యనారాయణ శ్లోకాలను చదివి చిన్నారులతో పలికించారు. శ్లోకాల భావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు టి.ప్రవల్లిక, వి.సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిపై అవగాహన అవసరం

మండవల్లి: పర్యావరణం–ప్రకృతిపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి, పచ్చదనాన్ని రక్షించడానికి విద్యార్థులు ముందుకురావాలని ఐక్య వేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, గ్రంథాలయాధికారి షేక్ పర్వీన అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండవల్లి శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని మనం రక్షిస్తే.. పర్యావరణం మనల్ని రక్షిస్తుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుడివాడ యామిని, నమ్రత, నవ దీపిక, సాయి, ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయాలు ఆహ్లాదకరంగా మారాయని గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. ఆదివారం అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన పోటీలు, ఆటల పోటీలను నిర్వహించారు. విజ్ఞాన శిబిరాల పేరుతో వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని బాల బాలికలు సద్వినియోగం చేసుకుంటున్నారని గ్రంథాలయాధికారులు తెలిపారు.

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ఆదివారం శతక పద్యాలు, నీతికథలు బోధించారు. ఉపాధ్యాయుడు పి.సూర్యనారాయణ మూర్తి శతక పద్యాలు, అర్థాలను విద్యార్థులకు విపులంగా వివరించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు.

వైభవంగా స్వామివార్ల గ్రామోత్సవం

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయక స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివార్ల వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం రంగనాయక స్వామి ఆలయంలో ఉదయం అవబృదోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధ్వజారోహణం బచ్చు రామకృష్ణ, రమావాణి దంపతుల ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం స్వామి వార్లను హనుమంత వాహనంపై ఆశీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు.క్యాంప్‌బెల్‌పేటకు చెందిన లక్ష్మీలీలా భాగవతారిణి ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం హరికథా కాలక్షేపం, మచిలీపట్నానికి చెందిన నాగరాజుబృందం ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ ఆంజనేయస్వామి పర్యవేక్షించారు.

ల్యాప్‌టాప్ చోరీ

పెనమలూరు: కానూరులో ల్యాప్‌టాప్ చోరీ ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన బొలుసు మహేంద్ర శ్రీనివాస్‌జగన్ హైదరాబాద్‌లో టీసీఎస్ సిస్టం ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. అతను అమెరికాలో ఎంఎస్ చేయడానికి విజయవాడ బెంజిసర్కిల్ వద్ద ఉన్న ఒక కన్సల్టెంట్ వద్ద ఇంటర్వ్యూ కోసం కొన్ని రోజుల క్రితం వచ్చాడు. కానూరులో ఇంజినీరింగ్ విద్యార్థి కౌశిక్ రూమ్‌లో ఉంటూ ఇంటర్వ్యూకు వెళ్లసాగాడు. ఈ నెల 1వ తేదీన ఉదయం విజయవాడలో ఇంటర్వ్యూకు వెళ్లి తిరిగి రూమ్‌కు వచ్చాడు. తాళాలు తెరిచి ఉంచిన రూమ్‌లో ల్యాప్‌టాప్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనికోసం స్థానికంగా వెదికినా దొరకలేదు. చోరీ ఘటనపై కేసు నమోదు చేశారు.

భార్య, కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

కంకిపాడు: భార్య, చిన్న కుమార్తె కనిపించటం లేదంటూ ఓ వ్యక్తి కంకిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన నమ్మి మోహనకృష్ణ, సాయి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. కానూరులోని బట్టల దుకాణంలో మోహనకృష్ణ పని చేస్తుంటాడు. ఈ నెల 3వతేదీ మోహనకృష్ణ డ్యూటీకి వెళ్లాక తన చిన్న కుమార్తె నిహారిక (17 నెలలు)కు పంచాయతీ కార్యాలయంలో టీకా వేయిస్తానని తీసుకెళ్లిన భార్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెదికినా ఫలితం లేదు. భర్త మోహనకృష్ణ.. భార్య సాయి, చిన్న కూతురు నిహారిక కనిపించటం లేదని పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న కల్యాణకర్తలు, పండితులు

కోడూరు: వేద పండితుల మంత్రోచ్చరణలు.. భాజా బజంత్రీలు.. మేళతాళాలు.. పుష్ప పరిమళాలు.. భక్తుల జయజయ ధ్వానాల నడుమ శ్రీనివాసుడి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. టీటీడీకి చెందిన వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. కోడూరుకు చెందిన యిమ్మడి వెంకట రామకృష్ణ ప్రసాద్–గిరిజా, కోట సీతారమేష్–జ్యోతి, రేపల్లెకు చెందిన చిట్టా మురళీకృష్ణ–ప్రియాంక దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ప్రముఖ ఉపన్యాస వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి కల్యాణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. స్వామి వారి, అమ్మ వారి గుణగణాలను భక్తులకు వివరించడంతో పాటు బ్రహ్మోత్సవాల పాటను ఆలపించి ఆకట్టుకున్నారు. దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు లడ్డూలను భక్తులు రాంబాబు, మురళీకృష్ణ, హనుశ్రీలు రూ. 51,228లకు వేలం పాట ద్వారా దక్కించుకున్నారు.

ఆకట్టుకున్న చందన శోభితుడి అలంకారం..

కల్యాణాన్ని పురస్కరించుకొని కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి మూలమూర్తులకు చేసిన అలంకారం ఆకట్టుకుంది. వెంకన్నను చందన శోభితుడిగా అలంకరించి భక్తులకు దర్శనమందించారు. ఆలయ ప్రాంగణమంతా వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

గరుడ, శేష వాహనాలపై ఊరేగింపు..

ఆదివారం గరుడ, శేష వాహనాలకు ప్రత్యేక పూజలు చేసి, వాటిపై కల్యాణమూర్తులకు తీరువీధి ఉత్సవం జరిపారు. కోడూరు, కృష్ణాపురం, ఇస్మాయిల్ బేగ్‌పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాల్లో ఊరేగింపునకు భక్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్ద వసంతోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించగా, ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు తీర్థప్రసాదాలు అందించారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



1997–98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని రుస్తుంబాద మున్సిపల్ హైస్కూల్ 1997–98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్న విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకుని క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ అంతా తిరిగి నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం పొందారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్యానం, యోగాలో శిక్షణ



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారానికి 28వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, ధ్యానం, యోగా నేర్పారు. సరస్వతీ దేవి ప్రార్థన చేసిన అనంతరం కథలు చెప్పి పుస్తకాలు చదివించారు. ఉపాధ్యాయిని జయలక్ష్మీ పిల్లలకు వైకుంఠపాళి, ఖర్చీఫ్ ఆట, కోలాటం ఆడించారు. సూర్య నమస్కారాలు, జీకే పై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో కూడా విద్యార్థులకు పై అంశాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాలను ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

అవనిగడ్డ: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. తెలుగు పద్యాలు చదవడం, చెప్పడం, కథలు చెప్పడం ఇంగ్లీష్ గ్రామర్, చిత్రలేఖనం, భగవద్గీత పారాయణం, శ్లోకాలు చదివించడం వంటివి నేర్పించారు. ఇంగ్లిష్ టీచర్ ఎ. సీతారామ్, ఆధ్యాత్మిక గురువు మత్తి శేషగిరిరావు, బి. కృపారావు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్ పర్యవేక్షించారు.

గంగానమ్మకు ఎమ్మెల్యే దంపతుల పూజలు



రేపల్లెలో గంగానమ్మ విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ దంపతులు

కైకలూరు: గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలకు ఎల్లప్పుడూ దక్కాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు అన్నారు. వింజరం గ్రామ శివారు రేపల్లెలో ఉలిసి వంశస్థుల ఆధ్వర్యంలో జరిగిన గంగానమ్మ ఆలయ శిఖర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా అన్నసమారాధన ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉలిసి సత్యనారాయణ, శ్రీను, రామకృష్ణ, పంజా రాంబాబు, బోడావుల కాశీ, బోయిన రామకృష్ణ, కరేటి రాంబాబు, పేర్రాజు, బోడావుల అప్పయ్య, ధర్మరాజుల సూర్యనారాయణ, మీగడ ఆంజనేయులు, మాటపాటి బాబు, మల్లారెడ్డి గంగాధరరెడ్డి, నెరుసు చింతయ్య, బోయిన కోటయ్య పాల్గొన్నారు.

కొండలమ్మ ఆలయంలో చండీ హోమం



హోమం నిర్వహిస్తున్న భక్తులు



పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో చండీ హోమాన్ని చేపట్టారు. ఆదివారం ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి భక్తుల సర్వ శ్రేయస్సు, ఆయురారోగ్యా ఐశ్వర్య అభివృద్ధికి ఈ హోమాన్ని చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుడివాడ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, కమిటీ ధర్మకర్తలు, ఆలయ అర్చకుడు శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడుల చెల్లింపు..

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మొక్కుబడులను చెల్లించుకునేందుకు క్యూలైనుల్లో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, పాలకవర్గం తగు ఏర్పాట్లు చేశారు.

కాలువల్లో వ్యర్థాలు..సాగునీటికి ఇబ్బందులు



తూములకు అడ్డంగా ఉన్న వ్యర్థాలను చూపుతున్న కౌలు రైతు సువర్ణరాజు

పెదపారుపూడి: పెదపారుపూడి వద్ద ఉన్న సౌత్ పంట కాలువలో వ్యర్థాల గుట్టలు సాగునీటికి ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలు, ఇతర వ్యర్థాలను కాలువలో వేయడంతో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. దీంతో పెదపారుపూడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పెదపారుపూడి సెంటర్‌లో మందుబాబులు రోజూ మద్యం తాగి ఖాళీ సీసాలను, క్యారీ బ్యాగులు, గ్లాసులను పంట కాలువలో వేయటంతో చెత్తా చెందారం బాగా పేరుకుపోయింది. దీంతో సౌత్ చానల్ నుంచి పంట బోదె ద్వారా వెళ్లి తూము వద్ద గాస్లులు, సీసాలు అడ్డంగా గుట్టలుగా పడిపోయాయి. దీంతో ఆకుమడుల సాగుకు నీరు దిగువ భూములకు అందటం లేదని గ్రామానికి చెందిన రైతు సువర్ణరాజు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంట బోదె కింద సుమారు 500 ఎకరాల సాగు ఉంది. ఇరిగేషన్ అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని మండిపడుతున్నారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన చేమస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఇరిగేషన్, పోలీస్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పరిశుద్ధరాజు, తదితరులు



మజ్జిగ పంపిణీ చేస్తున్న వెలమ సంఘం నాయకులు

కూచిపూడి(మొవ్వ): ఎండలు విజృంభిస్తున్న నేపథ్యంలో మజ్జిపంపిణీ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమైందని జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు పేర్కొన్నారు. ఆదివారం మొవ్వ మండల కూచిపూడి–పెదపూడి ప్రధాన కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మొవ్వ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి దగాని సంగీతరావు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. మజ్జిగ, చల్లని నీరు పంపిణీ చేశారు. ముందుగా కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల లేసి నివాళులు అర్పించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు, సామాజిక సంఘాలు, క్లబ్‌లు, నారాయణస్వామి ఫైనాన్స్, నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్, తదితర ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ ఆదివారం కొనసాగింది. వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 21వ రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండతీవ్రత తగ్గేవరకు ఈ పంపిణీ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ప్రభాకరరావు, ఎంవీ.సత్యన్నారాయణ, పి.వెంకట్, మరడాని చంద్రశేఖర్, వంగపండు బ్రహ్మాజీ, రామకృష్ణ, రమీజ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధన ద్వారా ఉన్నత శిఖరాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ ప్రసాద్ తదితరులు

బంటుమిల్లి: విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బంటుమిల్లి ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెడనకు చెందిన సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభ అవార్డులను అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మంచి ఫలితాలను సాధిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తుండటంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించారని చెప్పారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యా సంబంధమైన అవసరాలు తీర్చేందుకు సంస్థ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోను, కళాశాలల్లోను పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేసి సన్మానించారు. కె. సాంబశివరావు, ఆర్. ప్రసాద్, పి. నాగబాబు, మస్తాన్‌బేగ్ పాల్గొన్నారు.